క్లుప్తంగా

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో కొలువుదీరిన ఉత్సవమూర్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

నేటి నుంచి మౌలాలి స్వామి సరిగెత్తు



పీర్ల చావిడీలో కొలువుదీరిన మౌలాలిస్వామి

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో సోమవారం నుంచి మౌలాలిస్వామి సరిగెత్తు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 10 రోజుల క్రితం స్వామి వారు పీర్ల చావిడిలో పీర్లను కొలువుదీర్చడం జరిగిందన్నారు. కాగా సోమవారం నుంచి 2 రోజుల పాటు చిన్న సరిగెత్తు, పెద్ద సరిగెత్తు వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.

మహానందిలో భక్తుల సందడి



దర్శనానికి క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

మహానంది: సెలవు రోజు కావడంతో క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరి దేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. స్వామి, అమ్మవారి దర్శనం అనంతరం కోదండ రామాలయం, ఆంజనేయ స్వామి, వినాయక నంది, గరుడ నంది ఆలయాలను భక్తులు సందర్శించారు.


క్యారంబోర్డు టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నాగూర్‌ఖాన్

ఆత్మకూరు: స్థానిక స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యారంబోర్డు టోర్నీని ఆదివారం ప్రారంభించారు. అనంతరం స్పోర్ట్స్ క్లబ్ కోశాధికారి పటాన్ నాగూర్‌ఖాన్ మాట్లాడుతూ. విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. పోటీల్లో మొత్తం 16 జట్లు పాల్గొన్నాయన్నారు.అనంతరం గెలుపొందిన మొదటి టీంలకు వరుసగా రూ.2 వేలు, రూ.1500, రూ.వెయ్యి చొప్పున అందజేసినట్లు చెప్పారు. క్లబ్ చైర్మన్ పసిపున్ మున్నా, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ బలోపేతమే లక్ష్యం



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

వెలుగోడు: క్షేత్రస్థాయిలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని సంఘం జాతీయ నాయకుడు చిలుక రాబిన్‌సన్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైన మండల నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధనకు ఎంతోమంది త్యాగాలు చేసినట్లు చెప్పారు. ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బాయకటి బెనర్జీ, జిల్లా అధ్యక్షులు కత్తి ఓబులేష్ మాదిగ, శివనారాయణ, రాష్ట్ర నాయకులు కల్యాణ్ పాల్గొన్నారు.

ధర్మకర్త నియామకంపై విచారణ

నంద్యాల(వ్యవసాయం): బండి ఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామ మజరా క్రిష్ణనంది క్షేత్రంలో శ్రీవిష్ణునందీశ్వరస్వామి దేవస్థానానికి వంశపారంపర్య వ్యవస్థాపక ధర్మకర్త నియామకంపై ఆగస్టు 1న కర్నూలు దేవదాయ శాఖ కమిషనర్ విచారణ చేయనున్నట్లు ఈఓ వేణునాథరెడ్డి తెలిపారు. విష్ణునందీశ్వరస్వామి దేవస్థానానికి వంశపారంపర్య వ్యవస్థాపక ధర్మకర్తగా ప్రస్తుతం చిట్టిబొట్ల భరద్వాజశర్మ ఉన్నట్లు వెల్లడించారు.

ప్రయాణం నరకప్రాయం

- రహదారులు అడుగడుగునా గుంతల మయం
- వినతి పత్రాల స్వీకరణతోనే సరి
- ముఖ్యమంత్రికి విన్నవించినా ఫలితం శూన్యం
- ప్రయాణికులకు తప్పని అవస్థలు



గుంతల మయంగా ఉన్న గుంతకందాల రహదారి



రోడ్డు పై ఉన్న గుంతలో నిలిచిన వర్షపు నీటిలో బైకులతో యువకులు

పాములపాడు: అభివృద్ధికి సోపానాలు రహదారులు అంటారు. అయితే కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గోతుల రహదారిలో ప్రయాణం ప్రజలకు నరకప్రాయంగా మారింది. ప్రజల నుంచి ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు స్వీకరించడమే సరిపోయిందిమినహా పరిష్కారానికి తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆర్‌అండ్‌బీ మంత్రికి విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రహదారి పొడవునా భారీ గుంతలు

మండలంలోని మద్దూరు గ్రామం నుంచి వెలుగోడు మండలంలోని గుంతకందాల గ్రామ రహదారి గుంతల మయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రహదారి పొడవునా భారీ గుంతలు పడ్డాయి. మద్దూరు, క్రిష్ణానగర్, పెంచికలపల్లి గ్రామస్తులు ఏ అవసరం ఉన్నా సమీపంలోని వెలుగోడుకు వెళ్లడం పరిపాటి. ఈ మార్గం మధ్యలో క్రిష్ణానగర్ గ్రామం నుంచి గుంతకందాల గ్రామం వరకు సుమారు మూడున్నర కిలోమీరులో ఉన్న బీటీ రహదారి అడుగు లోతులో గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారిలో ప్రయాణం చేయడమంటే సాహసోపేతమేనని బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం వందలాదిగా ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. డ్రైవర్లు కూడా వామ్మో గుంతకందాల రహదారిలో నడపడమా అని భయాందోళనకు గురయ్యే పరిస్థితులు దాపురించాయి.

స్పందించని ముఖ్యమంత్రి, మంత్రి

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా ముచ్చుమర్రిలో నిర్వహించిన కార్యక్రమంలో, ఇటీవల రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి బానకచెర్ల రెగ్యులేటరు నుంచి నీటి విడుదలకు వచ్చిన సందర్భాన, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యలతో పాటు జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్, మండల కేంద్రంలో ఎంపీడీఓలకు పలు మార్లు గ్రామస్తులు రహదారి పరిస్థితిపై వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. అయినా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోకపోతే.. ఇంకెవరికి చెప్పుకోవాలని ప్రశ్నిస్తున్నారు.

సొంత డబ్బులతో కంప తొలగించాం



గ్రామస్తులం చందాలు వేసుకొని సొంతంగా రహదారి వెంట ఉన్న కంపచెట్ల తొలగింపుకు చర్యలు తీసుకున్నాం. మా సమస్యపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. రోడ్డుపైనున్న గుంతలతో నిత్యం నరకప్రాయమే. మా బాధలను ఏ అయ్య ఆలకిస్తాడో ఆయనకు దండాలు పెడతాము. ప్రతి రోజుల బస్సులో వెళ్లాలంటే కూడా నరకంగానే ఉంది.

– బాలు, ప్రైవేటు కాలేజీ లెక్చరర్

ప్రతిపాదనలు పంపాం

మిట్టకందాల గ్రామం నుంచి వయా మద్దూరు మీదుగా గుంతకందాల వరకు మొత్తం 6.22 కిలోమీటర్ల మేర నూతన బీటీ రోడ్డుకు ఇటీవల ప్రతిపాదనలు పంపాం. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నందున రోడ్డు వెడెల్పు చేయాలని కూడా అందులో పేర్కొనడం జరిగింది. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– రమణ, జేఈ, పంచాయతీరాజ్

ఆ రహదారిలో ప్రయాణమంటేనే భయం



నేను పాత ఇనుప వ్యాపారం చేస్తాను. మద్దూరు నుంచి వెలుగోడుకు వెళ్లాలంటే గుంతకందాల గ్రామం మీదుగానే వెళ్లాలి. ఏ వాహనం మీద వెళ్లాలన్నా భయమే. ఆ గుంతల వల్ల నడుము నొప్పులు వస్తున్నాయి. వర్షం పడినప్పుడు అయితే గుంతల్లో నీరు నిలిచి ఉండటంతో చాలా ప్రమాదకరంగా ఉంటున్నాయి. చాలా మంది కింద పడి గాయాలతో బయటపడిన సంఘటనలు ఉన్నాయి.

– శివాజీ, మద్దూరు

ముఖ్యమంత్రికి వినతి పత్రమిచ్చినా పని కాలేదు



సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, రోడ్డు భవనాల శాఖ బీసీ జనార్దన్‌రెడ్డిలకు రోడ్డు సమస్య గురించి గ్రామం తరుపున గ్రామ పెద్దలు వినతి పత్రం ఇచ్చి నెలలు గడుస్తోంది. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇక ఎవరికి చెబితే మాత్రం ఏం లాభం. మా ఖర్మ ఇంతేనని సరిపెట్టుకోవాల్సిందేనేమో అనిపిస్తుంది. మారుమూల గ్రామాలంటే ప్రభుత్వాలకు చిన్నచూపు అనేది అర్థమవుతోంది.

–అలిఉశేన్, మద్దూరు

మల్లన్న సేవలో..



రాజగోపురం వద్ద బిహార్ మంత్రి దంపతులకు స్వాగతం పలుకుతున్న ఈఓ



రిటైర్డ్ విజిలెన్స్ కమిషనర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న దేవస్థాన ఈఓ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను బిహార్ రాష్ట్ర కమర్షియల్ శాఖ మంత్రి నితీష్ మిశ్రా దంపతులు, రిటైర్డ్ విజిలెన్స్ కమిషనర్ రిటైర్డ్ విజిలెన్స్ కమిషనర్ అనిల్‌చంద్ర పునీత్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆదివారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన వారికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఏఈఓ, ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు మల్లికార్జున స్వామి వారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దనున్న ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ, ఏఈఓ స్వామి వారి శేషావస్త్రాలు, లడ్డూ ప్రసాదం, జ్ఞాపిక అందించి సత్కరించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సురేష్‌కుమార్ రెడ్డి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి

కొత్తపల్లి: ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని, అక్రమంగా మద్యం అమ్మితే కేసు నమోదు చేస్తామని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో ఎస్ఐ జయశేఖర్ ఆధ్వర్యంలో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాలలో పేకాట, పిక్కల ఆట, అక్రమంగా మద్యం అమ్మడం చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో అల్లర్లు, గొడవలు, ఘర్షణలు సష్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలో సోదాలు నిర్వహించి అక్రమంగా మద్యం అమ్ముతున్న బోయ వెంకటరమణ వద్ద నుంచి 15 మద్యం క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా గ్రామ ప్రజలతో సమావేశమై సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు.

- మహానంది: గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు. మసీదుపురం గ్రామంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ నేర నియంత్రణ కోసం కార్డెన్ సెర్చ్ చేపట్టామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

అబ్దుల్ కలాం వర్ధంతి



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి మొమిన్ ముస్సీర్ బాషా, బైరాపురం షేక్ మహబూబ్‌బాషా అన్నారు. పట్టణంలోని కృషి పండ్లతోటల రైతుసేవా సొసైటీ కార్యాలయంలో ఆదివారం అబ్దుల్‌కలాం వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన భారతదేశపు మిస్సైల్ మ్యాన్‌గా పేరుగాంచాడన్నారు. బాబు, బైరాపురం అక్బరుద్దీన్, నబిసా, రసూల్, ఇబ్రహీం, ఆనందరావు, గొల్లచంద్ర, మాలిక్, నరసింహులు పాల్గొన్నారు. అలాగే..మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని బీజేపీ జాతీయ మైనార్టీ కార్యవర్గ సభ్యురాలు మొమిన్ షబానా పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతి సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

బదిలీల్లో రాజకీయం

నంద్యాల(న్యూటౌన్): గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో రాజకీయ నాయకుల ప్రమేయం పెరిగిపోయిందని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల నిర్వహించిన బదిలీల్లో కొందరిని నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారని, దీనిపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశంపై లోకాయుక్తకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేల సిఫార్సులకు బదిలీల్లో ప్రాధాన్యత ఇచ్చారన్నారు.

క్యూబా దేశం కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

పాములపాడు: ప్రపంచ కార్మిక వర్గానికి స్ఫూర్తిదాయకమైన క్యూబా దేశం కోసం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఆదివారం మండలంలోని లింగాల గ్రామంలో క్యూబాకు సంఘీభావం తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యాదర్శి రాజశేఖర్, జిల్లా నాయకులు రామేశ్వరరావు మాట్లాడుతూ విద్యా, వైద్యం పూర్తిగా ప్రజల హక్కు అని, నేటికి ఒక్క శాతం కూడా ప్రైవేటు రంగం క్యూబాలో అడుగు పెట్టలేకపోయిందని తెలిపారు. అమెరికా ఖండంలో సోషలిస్టు విధానాలను సంపూర్ణంగా అమలు చేస్తున్న ఏకైక దేశం క్యూబా అని చెప్పారు. క్యూబా ప్రజలను ఆదుకోవడం మనందరి బాధ్యత అని, నిధి సేకరణ కార్యక్రమానికి విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు బాలయేసు, రమణ, టైలర్ రమణ, రాజు, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వీబీఆర్ నుంచి 13,200 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో



కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు



రిజర్వాయర్ నుంచి మద్రాస్ కాల్వకు నీరు వదిలిన దృశ్యం

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఆదివారం జలాశయం నుంచి దిగువకు 13,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఏఈ శివనాయక్ తెలిపారు. బానకచర్ల రెగ్యులేటర్ నుంచి వీబీఆర్‌కు 12వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరినట్లు చెప్పారు. దీంతో మద్రాస్ కాల్వకు 5వేల క్యూసెక్కులు, స్పిల్ వే నుంచి 8వేల క్యూసెక్కులు, వన్ ఆర్ తూము నుంచి 60, వన్ ఎల్ నుంచి 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం వీబీఆర్‌లో 15.108 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ వెల్లడించారు.

కేసీ కెనాల్‌కు 1,900 క్యూసెక్కుల నీరు

పాములపాడు: సుంకేసుల నుంచి కర్నూలు–కడప కెనాల్‌కు 1,900 క్యూసెక్కుల నీరు విడుదలవుతోందని ఏఈ శ్రీనివాసనాయక్ ఆదివారం తెలిపారు. మండలంలోని శాంతినిలయం గ్రామం సమీపంలో కేసీ కెనాల్ 120 కిలో మీటరు లాకీన్సలా వద్దకు 1200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. కాగా ఈ నీటిని తూడిచెర్ల సబ్‌చానల్‌కు 250 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 944 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు గేట్లు బంద్ చేసినట్లు వివరించారు.

యూరియా అందజేయాలి

బండి ఆత్మకూరు : రైతులకు సరిపడ యూరియా అందజేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో రైతు సంఘం నాయకుడు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు యూరియా అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. యూరియా కొరతతో పంటలకు సకాలంలో ఎరువులు అందక దిగుబడి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారన్నారు. ఇతర ప్రాంతాలకెళ్లి అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. అధికారులను అడిగితే రైతులకు సరిపడా యూరియా నిల్వలున్నాయని చెబుతున్నా..క్షేత్రస్థాయిలో మాత్రం అందుబాటులో లేవన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, మండల నాయకులు రత్తమయ్య, శరభ రెడ్డి, కార్మిక సంఘం నాయకులు రామచంద్రుడు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరులో కార్డెన్ సెర్చ్

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఆత్మకూరు సీఐ రాము ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పట్టణంలో పలు చోట్ల సోదాలు చేశామన్నారు. ఆత్మకూరు,కృష్ణాపురంలో రికార్డులు సరిగా లేని 12 బైకులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పలు చోట్ల అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. ఇందులో 4 మద్యం బాటిళ్లు, నాలుగు బీర్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

నేడు గరీబ్‌నగర్‌లో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

ఆత్మకూరు: పట్టణంలోని గరీబ్‌నగర్‌లో సోమవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండలాధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ తెలిపారు.స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గరీబ్‌నగర్‌లో సోమవారం నిర్వహించనున్న కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని కోరారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

ఆత్మకూరురూరల్: మండలంలోని అమలాపురం గ్రామ పొలాల్లో ఆదివారం ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులుకు సమాచారం వచ్చింది. దీంతో అక్కడికి వెళ్లి విచారించగా.. వడ్లరామాపురం గ్రామానికి చెందిన మంగళి నాగభూషణంగా (55) తెలిసింది.నాగభూషణంకు మతిస్థిమితం లేక పోవడమే కాక అప్పుడప్పుడు ఫిట్స్ వస్తున్నట్లు తెలిసింది. దీంతో భార్య వదలి వెళ్లిపోయింది. తల్లితో పాటు ఉంటున్న నాగభూషణం రెండు రోజులుగా అమలాపురం పరిసరాల్లో తిరుగుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వాల్మీకి నగర్, వడ్డేపేట, కుమ్మరిపేట, శేషశయనారెడ్డి నగర్ తదితర కాలనీలో సీపీఎం నాయకులతో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాలిటీలో రాజకీయ ఆధిపత్యం కోసం గ్రూపు రాజకీయాలకు పాల్పడుతున్నారని, మున్సిపాలిటీ అభివృద్ధి పైన, మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై శ్రద్ధ పెట్టడం లేదని ఆరోపించారు. కాలనీలలో అభివృద్ధి కుంటుపడిందని, ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మున్సిపాలిటీ తయారైందని ఎద్దేవ చేశారు. వాల్మీకి నగర్, ఉమ్మడి నగర్, జగనన్న కాలనీ, కుమ్మరిపేట, వడ్డేపేట, శశశయనా రెడ్డి నగర్, మారుతి నగర్, విలేకరుల కాలనీ, బైరెడ్డి నగర్, సీపీఎం కొట్టాలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు, నీటి సమస్య, విద్యుత్ సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి గోపాలకృష్ణ, ఎస్ ఉస్మాన్ బాషా, దూదేకుల బాబు, అబ్దుల్ రషీద్, మధు గౌడ్, గోకారి, కృష్ణ, రాధమ్మ, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుపై ఉద్యమాలు



మాట్లాడుతున్న రమేష్‌కుమార్

ఆత్మకూరు: స్మార్ట్ మీటర్లను తొలగించకపోతే దశల వారీగా ఉద్యమాలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహనాయక్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ధనుంజయ మీటింగ్ హాల్‌లో సీపీఎం కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని, అవసరమైతే ఇళ్ల వద్దే స్మార్ట్‌మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత.. మీటర్లు ఏర్పాటుకు ముందుకు రావడం సరికాదన్నారు. ఈ మీటర్ల వల్ల పాత మీటర్ల కంటే నాలుగింతల బిల్లు వస్తుందని చెబుతున్నారన్నారు. ఈ భారాన్ని పేదలు మోయలేరని, ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో దశల వారీగా ఆగస్టు నుంచే ఉద్యమాలు చేపడతామన్నారు. నాయకులు సుధాకర్, రణధీర్, రజాక్, రామ్‌నాయక్, మాబాషా, వీరన్న, కృష్ణమోహన్, దినేష్‌కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి

బండి ఆత్మకూరు : రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వ సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన, ఎంపీడీఓ రామకృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వే జరిగే గ్రామాల్లో జాయింట్ ఎల్పీఎం వల్ల చాలా మంది రైతులు తమ పొలాలకు బ్యాంకు రుణాలు తెచ్చుకోలేక, అలాగే క్రయ,విక్రయాలు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు మెమోలు ఇవ్వాలని ఎంపీడీఓకు సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ భావన రెడ్డి, వెటర్నరీ డాక్టర్ అనూష, ఏపీఓ వసుధ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లైన్ మార్చారు.. లైట్లు మరిచారు!



వీధిలైట్లు వెలగక పోవడంతో వీరాపురంలో అంధకారం నెలకొన్న దృశ్యం

కొత్తపల్లి: గ్రామాలలో త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు నూతన విద్యుత్ లైన్లను విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇందు కోసం గ్రామాలలో పాత విద్యుత్ వైర్లను తొలగించి కొత్త లైను వేశారు. అయితే పాత విద్యుత్ లైన్లకు ఉన్న వీధిలైట్లు కనెక్షన్లు కొత్త వైర్లకు మార్చకపోవడంతో పూర్తిగా పనిచేయకుండా పోయాయి. దీంతో గ్రామాలలో వీధిలైట్లు వెలగకపోవడంతో గ్రామాలు, గ్రామవీధులు సైతం అంధకారంలో ఉంటున్నాయి. అసలే అటవీ ప్రాంతం దగ్గరగా ఉండటంతో ప్రజలు రాత్రివేళలో చీకట్లో బయటికి రావాలంటే భయాందోళనకు గురివుతున్నారు. విద్యుత్ లైన్లు వేసిన వారిని వీధిలైట్ల కనెక్షన్ కూడా ఇవ్వాలని అడిగితే మాకు సంబంధంలేదని, కూటమి నాయకులు వేయిస్తారని సమాధానమిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.